సాక్షి ఖమ్మం
సోమవారం। 24। జూలై। 2023



నేటి నుంచి 'తొలిమెట్టు' శిక్షణ

కోవిడ్ ప్రభావంతో ప్రాథమిక విద్యార్థులకు కలిగిన నష్టాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు పథకాన్ని తీసుకొచ్చింది. 8లో



కడవరకూ కలిసే..

దంపతులిద్దరూ ఒకరోజు వ్యవధిలో మృతిచెందగా, ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన గన్నవరంలో చోటుచేసుకుంది. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్‌రావుకు డీఎంఏ కృతజ్ఞతలు



మంత్రిని సత్కరిస్తున్న డీఎంఏ డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్ : మెడికల్ సీట్లలో బీ క్యాట్‌లో 85శాతం సీట్లు స్థానికులకు కేటాయించటంతో ఎంతో మంది విద్యార్థులకు లబ్ధి జరుగుతుందని డాక్టర్స్ మెడికల్ అకాడమీ (డీఎంఏ) డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణి కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సిద్దిపేటలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 85శాతం స్థానికత సీట్లతో పాటు మరో 15శాతం స్థానికతకు కేటాయించగా.. వచ్చిన అభ్యంతరాలు పరిష్కారమై ఆ 15 సీట్లు సైతం స్థానికులకే వస్తాయని మంత్రి చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సిరి, వర్షిణి, ఐశ్వర్య, అంజలి, వంశీ, ఆద్యంత్ తదితరులు పాల్గొన్నారు.

సీజే ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ నామ



ప్రమాణస్వీకారోత్సవంలో ఎంపీ నామ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయగా సీఎం కేసీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన సీజేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జెడ్పీ ప్రత్యేక సమావేశం

ఖమ్మం సహకారనగర్ : జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 25న ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ వి.వి.అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆదివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

బీఏఎస్‌లో విద్యార్థుల ఎంపిక వాయిదా

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక కోసం స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించాల్సిన కార్యక్రమం వాయిదా పడినట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ బుధవారం ఉదయం 11గంటలకు ఒకటో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 3గంటలకు 5వ తరగతి విద్యార్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

జేఈ రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 14 జేఈ(ఈఅండ్ఎం) ఇంటర్నల్ పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించగా 10 మంది అభ్యర్థులు హాజరైనట్లు సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. సింగరేణి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన రాత పరీక్షను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు.

విమర్శల హోరు!

పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు

- ప్రత్యర్థి పార్టీల వ్యాఖ్యలే బ్రహ్మాస్త్రాలుగా ముందుకు..
- ఢీ అంటే ఢీ అంటున్న బీఆర్‌ఎస్–కాంగ్రెస్
- ఆచితూచి స్పందిస్తున్న బీజేపీ, వామపక్షాలు

జిల్లాలో రాజకీయ పార్టీల విమర్శల తుపాను ఉధృతమైంది. ఎన్నికల వేళ అందివచ్చిన అవకాశాలను ఒడిసి పట్టుకుని రాజకీయంగా అనుకూల పరిస్థితులను సృష్టించుకునేందుకు పార్టీలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కన్నేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ దిశగా పావులు కదుపుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలను ఇరుకున పెట్టేలా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రెచ్చిపోతున్నాయి. సొంత పార్టీకి మైనస్ కాకుండా.. ప్రత్యర్థి పార్టీకి నష్టం కలిగించే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల వేడి చల్లారకుండా బీఆర్‌ఎస్ ఆందోళనలు చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ కూడా కార్యక్రమాలను ముమ్మరం చేసింది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

బీఆర్‌ఎస్ భేరీనాదం..

జిల్లాలో బీఆర్‌ఎస్ నేతలు సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా సమాయత్తం అవుతున్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్‌ఎస్ ఆందోళనకు దిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే అంశంపై బీఆర్‌ఎస్ విమర్శలు సంధించగా.. జిల్లాలోనూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఇదే అంశంపై వరుస ఆందోళనలు, దిష్టిబొమ్మ దహనాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటల కరెంట్ ఇవ్వదంటూ విమర్శలు సంధిస్తున్నారు.

జోరు మీదున్న కాంగ్రెస్..

ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లాలో జోరు పెంచింది. బీఆర్‌ఎస్ తీరును ఎండగట్టేందుకు పూర్తిగా సిద్ధమవుతోంది. కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు నాయకులు సమాయత్తం అవుతున్నారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా కావడం లేదనే అంశాన్ని రైతులకు అర్థమయ్యేలా పలు సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించారు. మరోవైపు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో పర్యటిస్తూ బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన అనేక సమస్యలను భట్టి వివరిస్తుండగా.. పొంగులేటి నేరుగా బీఆర్‌ఎస్‌పైకి విమర్శలు ఎక్కుపెడుతున్నారు. సిట్టింగ్‌లందరికీ బీఫామ్‌లు ఇచ్చే దమ్ముందా అంటూ బీఆర్‌ఎస్ అధినేతకే పొంగులేటి సవాల్ విసిరారు. ఈ క్రమంలో ఈ రెండు పార్టీల మధ్య వచ్చే ఎన్నికల్లో హోరాహోరీ తప్పదనే చర్చ జరుగుతోంది.

ఎన్నికల వ్యూహాల్లో వామపక్షాలు..

జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు సభలు, సమావేశాలతో హోరెత్తిస్తుండగా.. భారతీయ జనతాపార్టీ, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా



తదితర పార్టీలు మాత్రం ఆచితూచి స్పందిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ప్రత్యర్థికి ఎటువంటి అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో నాయకులు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. సీపీఎం, సీపీఐ జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ.. సంచలన వ్యాఖ్యలకు మాత్రం దూరంగానే ఉంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఎన్నికల కురుక్షేత్రానికి పార్టీలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ కార్యోన్ముఖులను చేస్తున్నారు.

వేచిచూసే ధోరణిలో బీజేపీ..

బీజేపీ ప్రస్తుతం వేచి చూసే ధోరణి అవలంబిస్తోంది. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో సత్తా చాటాలని రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. జూన్ 15న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభ ఖమ్మంలో నిర్వహించాల్సి ఉండగా.. తుపాను కారణంగా వాయిదా పడింది. దీంతో ఆ పార్టీ శ్రేణులు కొంత నిరాశకు గురయ్యాయి. ఈ సభ ఈనెల 29న ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా మాత్రం ఇంకా అమిత్‌షా పర్యటన ఖరారు కాలేదు. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా నాయకత్వం భావిస్తోంది. ఆ మేరకు సభకు జన సమీకరణ చేయాలని, ఆ తర్వాత ప్రత్యర్థి పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరో రెండు, మూడు నెలల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలతోపాటు వామపక్షాలు, బీజేపీ, వైఎస్సార్‌టీపీ, బీఎస్పీ తదితర పార్టీలు కూడా ఎన్నికల కదనరంగంలో విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తించడానికి సిద్ధమయ్యే అవకాశం ఉంది.

సేవలు సరళతరం..

- ఓపీ స్లిప్పులపై క్యూ ఆర్ కోడ్
- ఎక్కడికి వెళ్లినా తెలిసేలా ఆన్‌లైన్‌లో నమోదు
- ఉమ్మడి జిల్లాలోని 12 ఆస్పత్రుల్లో అమలు

సత్తుపల్లిటౌన్: సర్కారు ఆస్పత్రులకు పేషెంట్లు తక్కువగా వచ్చినా.. ఎక్కువ సంఖ్యలో చూపించే పద్ధతికి స్వస్తి పలుకుతూ.. ఓపీ సేవల్లో ప్రభుత్వం పారదర్శకతను పెంచింది. వైద్యులు కూడా మొక్కుబడి సేవలకు పరిమితం కాకుండా వారి పనితీరును పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచింది. క్యూఆర్ కోడ్‌లో స్కాన్ చేస్తే ఏ వైద్యుడి దగ్గర ఏ ట్రీట్‌మెంట్ తీసుకున్నారో తెలియనుంది.

కార్పొరేట్‌కు దీటుగా..

ప్రజారోగ్య సేవలను మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. కార్పొరేట్‌కు దీటుగా వైద్య విధాన పరిషత్‌లోని ప్రభుత్వ ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఓపీ స్లిప్‌లకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తొలుత ఏరియా ఆస్పత్రుల్లో ఈ నూతన పద్ధతిని అమలు చేయడం ఆరంభించారు.

ఏం చేస్తారంటే..

ఓపీ చిట్టీకి ప్రత్యేక కోడ్ నంబర్‌ను కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోగుల బయోడేటా, వ్యాధి నిర్ధారణ, ట్రీట్‌మెంట్, మందుల వివరాలన్నీ టీఎస్‌ఈఎంఐఎస్ డేటాస్టోర్‌కు వెళ్తాయి. కంప్యూటర్‌లో పేరు, వివరాలు నమోదు చేసి ప్రింటెడ్ చిట్టీ ఇస్తారు. దీనిని డాక్టర్ వద్దకు తీసుకెళ్తే చిట్టీపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో టీఎస్‌ఈహెచ్‌ఎంఐఎస్(తెలంగాణ స్టేట్ ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం)కు అనుసంధానం చేస్తారు. రోగికి రక్త, ఎక్స్‌రే ఇతర పరీక్షలు అవసరమైతే చేయించి.. ఆ పరీక్షల ఫలితాల ఆధారంగా మందులు రాస్తారు. ప్రిస్కిప్షన్‌ను కూడా ఫొటో తీసి టీఎస్ ఈహెచ్‌ఎంఐఎస్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రతీ వైద్యుడు పేషెంట్ల ఓపీ చిట్టీలతో అందించిన వైద్య సేవలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడం వల్ల చిట్టీ నంబర్ చెప్పగానే టీఎస్‌ఈహెచ్‌ఎంఐఎస్ యాప్‌లో రోగి పొందిన వైద్య సేవలు కనిపిస్తాయి. ఇలా ఏ ఏరియా ఆస్పత్రికి వెళ్లినా గతంలో పొందిన వైద్య సేవల చిట్టీ లేకపోయినా.. నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే వివరాలు తెలిసేలా ఆధునీకరించారు.

జిల్లా ఆస్పత్రులతో పాటు..

ఖమ్మం, కొత్తగూడెం జిల్లా ఆస్పత్రులతో పాటు మెడికల్ కళాశాలలు, సత్తుపల్లి, మధిర, మణుగూరు, భద్రాచలం ఏరియా ఆస్పత్రులు, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కల్లూరు, పెనుబల్లి, అశ్వారావుపేట, పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయి. వీటిలో ఈ ఆధునిక సేవలను అమలు చేస్తున్నారు. కాగా ఓపీ చిట్టీలను కంప్యూటర్‌లో నమోదు చేసేదుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను మాత్రం నియమించకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



ప్రిస్కిప్షన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వైద్యుడు

వైద్య సేవలు పారదర్శకంగా..



ఏరియా ఆస్పత్రుల్లో ఆధునిక పద్ధతిలో కార్పొరేట్‌కి ధీటుగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఓపీ సేవలను కంప్యూటరీకరించింది. అన్ని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఈ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన వైద్యం అందుతుండడంతో పాటు వైద్య సేవలపై పారదర్శకత పెరుగుతుంది. – కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సత్తుపల్లి

దోబూచులాడుతున్న గోదావరి

- ఉదయం 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సాయంత్రం 42 అడుగులకు తగ్గడంతో ఉపసంహరణ
- వరద ప్రవాహాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్న అధికారులు



భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. గోదావరి వరద ఉధృతి శనివారం సాయంత్రం వరకు నెమ్మదిగా తగ్గింది. రాత్రి వేళ నుంచి పెరుగుతూ వచ్చింది. అధికారుల అంచనాలకు అందని విధంగా ఆదివారం ఉదయం 7 గంటలకు నీటిమట్టం 43.40 అడుగులకు చేరింది. దీంతో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక మొదటి ప్రమాదక హెచ్చరిక జారీ చేసి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భద్రాచలం వద్ద 9 లక్షల 51 వేల 120 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వరద ప్రవాహం మరికొంత పెరిగే అవకాశం ఉండటంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్న ఉదయం 10 గంటల తర్వాత అధికారుల అంచనాలను తారుమారు చేస్తూ గోదావరి నీటిమటం మళ్లీ తగ్గుముఖం పట్టింది. సుమారు రెండు గంటల పాటు నిలకడగా ఉండి తర్వాత తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి నీటిమట్టం 42 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ఎగువ ప్రాంతాల నుంచే వరద ప్రవాహంపై అధికారులకు పూర్తిస్థాయిలో అంచనా, సమాచారం లేకపోవడంతోనే గందరగోళానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. కానీ జిల్లా అధికారులు మాత్రం ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. ఎగువన ఉన్న ప్రాజెక్ట్‌ల్లో భారీగా వరద నీరు ఉందని, ఏ క్షణమైనా గోదావరి మళ్లీ పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతో భద్రాచలానికి దిగువన ఉన్న గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా భద్రాచలం వద్ద నీటిమట్టం ఆధారంగానే ఏపీలోని రాజమండ్రి వరకు ఉన్న మండలాల ప్రజలను అధికారుల అప్రమత్తం చేస్తారు.

ఆదివారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం(అడుగుల్లో)..

ఉదయం	7 గంటలకు :	43.01
ఉదయం	8 గంటలకు :	43.50
ఉదయం	9 గంటలకు :	43.60
ఉదయం	10 గంటలకు :	43.60
ఉదయం	11 గంటలకు :	43.50
మధ్యాహ్నం	12 గంటలకు :	43.40
రాత్రి	8 గంటకు :	42.40
రాత్రి	10 గంటలకు :	42.20

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఖమ్మంలో అండర్‌గ్రౌండ్ పైపులైన్ పనులు
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడి



పైప్‌లైన్ నిర్మాణ మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి అజయ్‌కుమార్



చెక్‌డ్యామ్ పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంఅర్బన్: నగరంలో మురుగు సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు గోళ్లపాడు తరహాలో అండర్‌డ్ మురుగునీరు తరలించే పైపులైన్ పనులు చేపట్టినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పైపులైన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర ప్రజల ఆహ్లాదం, ఆరోగ్యం కోసం లకారం ట్యాంక్‌బండ్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ కాబోతోందని చెప్పారు. రెండు ట్యాంక్‌బండ్‌ల మధ్య ఉన్న మురుగు కాల్వను శుభ్రం చేసి అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా మురుగు తొలగించి సుందరీకరణ పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ సమస్యను పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, రూ.10 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఆ నిధులతో లకారం ట్యాంక్‌బండ్, మినీ లకారం మధ్య మురుగుకు శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. వైరా రోడ్డులోని నాగార్జున ఫంక్షన్ హాల్ నుంచి చెరువుబజార్ మజీద్ వరకు 1.8 కి.మీ. మేర అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణానికి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా వేర్వేరుగా వెళ్లిన మురుగునీరు ప్రకాశ్‌నగర్ వద్ద గల సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు వెళ్లి, అక్కడ శుద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియతో కాలుష్య రహితంగా ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండదని వివరించారు. పై భాగంలో ప్రజలకు ఆహ్లాదం పంచేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ప్రజారోగ్య శాఖ ఈఈ రంజిత్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, సరిపుడి రమాసతీష్, బిక్కసాని ప్రశాంతిలక్ష్మి, జస్వంత్, ఆళ్ల నిరీషా అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ పరిశీలించిన పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యామ్‌ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో లోతట్టు ప్రాంతాల వారికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ పునుకొల్లు నీరజకు సూచించారు. అందుకు తగు ఏర్పాట్లు చేయాలని, అధికారులను అప్రమత్తం చేయాలని చెప్పారు.

మైనారిటీలకు అండగా ప్రభుత్వం

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి అజయ్ కుమార్ పేర్కొన్నారు. మైనార్టీ వర్గాలకు సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు మైనార్టీల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులకు రూ.1000 పెన్షన్ పెంచుతూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారని, నేడు మైనార్టీలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

జాతీయ రహదారికి భూములివ్వం

- సర్వేను అడ్డుకున్న రైతులు
- భారీగా పోలీసుల మోహరింపు



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

చింతకాని : నాగపూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి భూములివ్వబోమని రైతులు స్పష్టం చేశారు. మండల పరిధిలోని వందనం, కొదుమూరు గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూముల్లో ఆదివారం భారీ పోలీసు బలగాలతో కలిసి సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తమ అనుమతి లేకుండా సర్వే చేసేందుకు ఎలా వచ్చారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న, చిన్నకారు రైతులకు సంబంధించిన భూములను బలవంతంగా లాక్కోవాలని ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నీటి వసతి ఉండి పంటలు సాగు చేసుకునే భూములు ఇస్తే జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలనైనా తీసుకుంటాం కానీ.. భూములిచ్చేది లేదని తేల్చిచెప్పారు. పోలీసు, రెవెన్యూ అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమిరా అన్నారు. కలెక్టర్ ఆదేశాలతోనే తాము సర్వేకు వచ్చామని అధికారులు చెప్పగా.. కలెక్టర్‌తో తమను మాట్లాడించాలని రైతులు కోరారు. దీంతో రైతులను కలెక్టరేట్ వద్దకు తీసుకెళ్లగా, అదనపు కలెక్టర్ మధుసూదన్ రైతులతో చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో చింతకాని, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ తహసీల్దార్లు మంగీలాల్, నర్సింహారావు, సుమ తదితరులు పాల్గొన్నారు. కాగా, వైరా సీఐ సాగర్‌తో పాటు సుమారు 100 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాట్లుచేశారు.

సర్వే చట్టవిరుద్ధం

నాగపూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి అధికారులు చట్ట విరుద్ధంగా సర్వే చేస్తున్నారని సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు విమర్శించారు. సర్వేకు నిరసనగా కొదుమూరు – చినగోపతి రహదారిపై రైతులతో కలిసి వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎకరం రూ.1.50 కోట్ల మేర ఉండగా అధికారులు కేవలం రూ.25 లక్షలతో సరిపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ జాతీయ రహదారి అవసరం లేదని జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు సమావేశాలు నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానం చేశామని తెలిపారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించకుండా అక్రమంగా జాతీయ రహదారిని నిర్మించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డే నారాయణరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ పాల్గొన్నారు.

రైతులతో అదనపు కలెక్టర్ చర్చలు

ఖమ్మం సహకారనగర్ : నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి భూ నిర్వాసిత రైతులతో అదనపు కలెక్టర్ మధుసూదన్ ఐడీఓసీలో ఆదివారం చర్చలు జరిపారు. రైతులు పలు అంశాలు లేవనెత్తగా వారితో మాట్లాడిన మధుసూదన్.. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

క్లుప్తంగా

కిన్నెరసానిలో సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులు, డ్యాం పైనుంచి జలాశయాన్ని వీక్షించి ఉల్లాసంగా గడిపారు. 746 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్‌కు రూ.29,985.. 270 మంది బోటింగ్ చేయడం ద్వారా రూ.16,730 ఆదాయం టూరిజం శాఖకు లభించిందని నిర్వాహకులు తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

ఖమ్మంక్రైం: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు కిందపడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. త్రీటౌన్ ప్రాంతంలోని పిల్లి కృష్ణయ్యతోటకు చెందిన కొట్టె శ్రీనివాస్ (55) ఇందిరానగర్‌లో జరుగుతున్న ఓ నూతన ఇంటి నిర్మాణంలో పైన కట్టిన పరంజీలపై నిల్చొని పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు అతను జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. టూటౌన్ సీఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఎక్కిన పాము



హ్యాండిల్‌పై పాకుతున్న పాము

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామంలో ఓ వ్యక్తి టీవీఎస్ మోపెడ్ పైకి పాము ఎక్కడంతో సదరు వ్యక్తి భయాందోళనకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. సమీప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాలేరు కిరాణా సరుకుల నిమిత్తం రాగా అతను సరుకులను కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కొద్దిదూరం వెళ్లగానే హ్యాండిల్‌పైకి పాము పాకుతూ కనిపించింది. దీంతో అతను కంగారుగా వాహనాన్ని నిలిపివేయగా అటుగా వెళ్తున్నవారు పామును చంపివేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

మధిర: మడుపల్లి క్రాస్ రోడ్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొనగా ఒకరికి గాయాలయ్యాయి. బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన కొమెర శ్రీను మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం




నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా 13.5 కేజీల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలిందని సీఐ వెల్లడించారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, వాహనాన్ని సీజ్ చేశామని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, సీఐ రహీమున్నీసాబేగం, ముబాశిర్ అహ్మద్, సందీప్, రతన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోళ్ల వ్యాన్ సామగ్రి చోరీ

బూర్గంపాడు: సారపాకలో కన్నెదారి రమేశ్‌కు చెందిన కోళ్ల వ్యానులోని సామగ్రి శనివారం రాత్రి చోరీకి గురైంది. ఆదివారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రమేశ్‌కు చెందిన కోళ్ల వ్యానును శనివారం రాత్రి సారపాక ఆర్చి వద్ద పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని దొంగలు వ్యాను బ్యాటరీ, ఫ్రిజ్, జాకీలను అపహరించారు. వీటి విలువ రూ.78 వేల వరకు ఉంటుందని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదనపు ఎస్ఐ యేసోబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

నేటి నుంచి 'తొలిమెట్టు' శిక్షణ

- గతేడాది సత్ఫలితాలు..
- ఈ ఏడాది పకడ్బందీగా అమలు

ఖమ్మంసహకారనగర్: కోవిడ్–19 ప్రభావం విద్యార్థుల చదువులపై తీవ్రంగా పడింది. ఆ నష్టాన్ని అధిగమించేందుకు 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2022–23 విద్యాసంవత్సరంలో తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) తీసుకొచ్చింది. తెలుగు, గణితం, ఇంగ్లిష్‌లో సామర్థ్యాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. విద్యార్థుల సామర్థ్యాల సాధనలో తొలిమెట్టు సత్ఫలితాలనివ్వడంతో ఈ ఏడాది (2023–24) మరింత పకడ్బందీగా తొలిమెట్టును అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలుకానున్నది. రాష్ట్రస్థాయిలో జిల్లా నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు శిక్షణ పొందగా.. వారంతా జిల్లాస్థాయిలో శిక్షణనివ్వనున్నారు.

ప్రతి సబ్జెక్టులో ఇద్దరికి..

నగరంలోని రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఇందులో ప్రతి మండలం నుంచి తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించే ఇద్దరు రిసోర్స్ పర్సన్‌లను మండల నోడల్ అధికారులు ఎంపిక చేస్తారు. వీరికి రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన ఐదుగురు ఉపాధ్యాయులు వీరికి శిక్షణ ఇస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మండలస్థాయిలో ఈ నెల 31 నుంచి మూడు విడతలుగా 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.

కాగా, 2023–24 విద్యా సంవత్సరంలో బోధనను మరింత సమర్థవంతంగా మార్చి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు ప్రతి విద్యార్థికి ఎస్‌సీఈఆర్‌టీ ప్రత్యేకంగా రూపొందించిన తెలుగు, గణితం, ఇంగ్లిష్ వర్క్ బుక్‌లను ప్రతి విద్యార్థికి ఉచితంగా అందించనున్నారు. బోధనా ప్రక్రియను కచ్చితమైన సోపానాల ప్రకారం నిర్వహించేందుకు ఉపాధ్యాయులకు పాఠ్య ప్రణాళికలను రూపొందించి అందించనున్నారు. తరగతి గదిలో సులభంగా, సమర్థవంతంగా బోధన జరిగేందుకు బోధనోపకరణాలు రూపొందించటం, వినియోగించటంపై కూడా శిక్షణ ఇవ్వనున్నారు.



గతేడాది తొలిమెట్టు సమీక్షలో సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

వివరాలిలా..	
ప్రాథమిక – ప్రాథమికోన్నత పాఠశాలలు	995
శిక్షణ పొందనున్న ఉపాధ్యాయులు	2,335
1 నుంచి 5 తరగతి విద్యార్థులు	43,039



హైదరాబాద్‌లో తొలిమెట్టు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు (ఫైల్)

నేటి నుంచి శిక్షణ ఇవ్వనున్నాం



తొలిమెట్టుకు సంబంధించి ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో సోమవారం నుంచి శిక్షణ కార్యక్రమం నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో ప్రారంభం కానుంది. ఎంపికైన ప్రతి మండల రిసోర్స్‌పర్సన్ తప్పనిసరిగా సమయానికి హాజరై శిక్షణలో బోధించే మెళకువలను అర్థం చేసుకుని అందరు ఉపాధ్యాయులకు చేరేలా కృషి చేయాలి. గత సంవత్సరం తొలిమెట్టు జిల్లాలో అద్భుత ఫలితాలనిచ్చింది. కలెక్టర్ గౌతమ్ సూచనల మేరకు నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు నెలాఖరులో పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పెంచనున్నాం.

– సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంసహకారనగర్: నూతనంగా నియమితులైన ఇన్‌చార్జ్‌లు పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు పులిపాటి వెంకయ్య, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావేద్‌లతో కలిసి ఖమ్మం జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు, మండలాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారితో నిర్వహించిన సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు కొత్త ఇన్‌చార్జ్‌లను నియమించామని, పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. మండల అధ్యక్షులు వారి బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇన్‌చార్జ్‌లకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

ఇన్‌చార్జ్‌లు వీరే..

పాలేరు నియోజకవర్గానికి మడుపల్లి భాస్కర్, ఖమ్మం అసెంబ్లీ నియోజకర్గానికి పసుపులేటి దేవేందర్, మధిరకు వడ్డే నారాయణరావు, వైరాకు యర్రం బాలగంగాధర్‌తిలక్, సత్తుపల్లికి పుచ్చకాయల వీరభద్రంను నియమించారు.

మండలాల వారీగా.. తిరుమలాయపాలెంకు బొడ్డు బొందయ్య, ఖమ్మంరూరల్‌కు లకావత్ సైదులు నాయక్, కూసుమంచికి మహ్మద్ అఫ్జర్, నేలకొండపల్లికి మొక్కా శేఖర్‌గౌడ్, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పాలకుర్తి నాగేశ్వరరావు, నల్లమల సత్యంబాబు, దొబ్బల సౌజన్య, మలీదు వెంకటేశ్వరరావు, బీహెచ్ రబ్బానీ, గుడిపూడి సురేశ్, ముదిగొండకు అంబటి వెంకటేశ్వరరావు, చింతకానికి కందుల వీరబాబు, బోనకల్‌కు మట్టా రవీందర్‌రెడ్డి, మధిర బండారు నరసింహారావు, ఎర్రుపాలెంనకు పారుపల్లి విజయ్‌కుమార్, కారేపల్లికి బానోత్ రామూర్తి నాయక్, జూలూరుపాడుకు మాట్టూరి కృష్ణారావు, ఏన్కూర్‌కు కిలారు అనిల్‌కుమార్, కొణిజర్లకు వేముల కృష్ణప్రసాద్, వైరాకు కూరపాటి కిశోర్, తల్లాడకు తోట జనార్దన్, కల్లూరుకు వడ్లమూడి కృష్ణయ్య, పెనుబల్లికి తుమ్మూరు లక్ష్మారెడ్డి, సత్తుపల్లికి కొండూరి కిరణ్, వేంసూర్‌కు అలావత్ వెంకటేశ్వరరావు, కామేపల్లికి దమ్మాలపాటి సత్యనారాయణను నియమించారు. వీరందరితో పాటు ఎల్‌డీఎం(లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్) నియోజకవర్గ కోఆర్డినేటర్‌లుగా సత్తుపల్లికి బెల్లం శ్రీనివాస్, వైరాకు మద్దినేని రమేశ్‌ను నియమించారు.

సిగరెట్ తాగొద్దన్నందుకు దాడి

ఖమ్మంఅర్బన్: సిగరెట్ తాగుతున్న యువకులను దూరంగా పోయి తాగాలని చెప్పినందుకు వారు దాడి చేశారు. ఈ ఘటనపై ఆదివారం ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం సాయంత్రం ధంసలాపురానికి చెందిన ఎస్.వెంకటమ్మ ఇంటి ఎదురుగా నలుగురు యువకులు సిగరెట్ తాగుతూ వదులుతున్న పొగ ఇంట్లోకి వస్తోంది. గమనించిన వెంకటమ్మ, కుమారుడు నాగరాజు.. దూరంగా వెళ్లి తాగండని చెప్పారు. దీంతో చంటి అనే యువకుడితో పాటు మిత్రులు మరో ముగ్గురు కలిసి వారిని అసభ్యకరంగా దూషిస్తూ రాళ్లతో దాడి చేశారని, పోలీసులకు చెపితే చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెక్యులర్, ప్రోగ్రెసివ్ ఉమ్మడి పౌరస్మృతి అవసరం



మాట్లాడుతున్న విద్యావేత్త ఐవీ రమణ

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఉమ్మడి పౌరస్మృతి తీసుకువచ్చేందుకు ఒక చర్యను లేవనెత్తిందని, కానీ, ఇంతవరకు ముసాయిదా డ్రాఫ్ట్ కూడా లేకుండా దేశంలో విద్వేష, విభజన రాజకీయాలు తీసుకురావడం కోసం దీనిని వాడుకుంటోందని ప్రముఖ విద్యావేత్త ఐవీ రమణ అన్నారు. ఆదివారం ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇన్ని భిన్నత్వాలు ఉన్న ఈదేశంలో కావాల్సింది బీజేపీ ఉమ్మడి పౌరస్మృతి కాదని, సెక్యులర్, ప్రోగ్రెసివ్ ఉమ్మడి పౌరస్మృతి అని పేర్కొన్నారు. గోవా పౌరస్మృతినే దేశ ఉమ్మడి పౌరస్మృతిగా మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. అక్కడి పౌరస్మృతి ప్రకారం.. హిందువులు ఎందరినైనా వివాహం చేసుకోవచ్చని, మగ పిల్లాడిని కనడం కోసం మరొకరిని పెళ్లిచేసుకోవచ్చనే అభ్యంతరకరమైన అంశాలున్నాయని, దానిని దేశం మొత్తానికి అమలు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేంద్రం పన్నాగం పన్నుతోందని గ్రహించాలని సూచించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు మాట్లాడుతూ.. మణిపూర్ ప్రజలకు భారతీయులంతా అండగా ఉండి మారణహోమాన్ని ఆపేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ మాట్లాడగా చావా రమేశ్, రాయల రవికుమార్, రామారావు, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, శిరోమణి, మంగతాయి, చందువెంకటేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంసిద్ధ పుస్తక పరిచయ సభ



మాట్లాడుతున్న మువ్వా శ్రీనివాసరావు

ఖమ్మంగాంధీచౌక్: ఒంటరి మహిళ జీవన గాథలపై హెచ్ఆర్సీ ఫౌండేషన్ రూపొందించిన కథా సంకలన పరిచయ సభ ఆదివారం ఖమ్మం నగరంలోని గట్టయ్యసెంటర్‌లో ఉన్న టెండర్ రూట్స్ పాఠశాలలో జరిగింది. ఖమ్మం సాహితీ మిత్రుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో బండారు విజయ, పి.జ్యోతి సంపాదకత్వంలో రూపొందించిన స్వయంసిద్ధ కథా సంకలనంపై పలువురు సాహితీ వేత్తలు మాట్లాడారు. ఒంటరి మహిళ జీవన గాథలపై కథా సంకలనం రూపొందించటం అభినందనీయమని ప్రశంసించారు. తోట సుభాషిణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీ వేత్తలు మువ్వా శ్రీనివాసరావు, రవిమారుత్, జ్వలిత, పోతగాని సత్యనారాయణ, ఫణి మాధవి, బ్రహ్మచారి, ప్రియదర్శిని కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కడవరకూ కలిసే..

- గుండెపోటుతో భార్య.. రైలు ఢీకొని భర్త..
- ఒకరోజు తేడాతో దంపతుల దుర్మరణం



ఒకే చితిపై పేర్చిన కృష్ణ, అలివేలు మృతదేహాలు

వైరారూరల్: నిండునూరేళ్లూ కలిసి ఉండాల్సిన దంపతులు ఒకరోజు వ్యవధిలో మృతిచెందగా, ఇద్దరికీ కలిపి ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన వైరా మండలం గన్నవరంలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వన్నావరపు అలివేలు (50) శుక్రవారం ఇంటి పెరడులో పిచ్చి మొక్కలు తొలగిస్తూ గుండెపోటుకు గురై మృతిచెందింది. కాగా, గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ఉంటున్న తమ బంధువు దశదిన కర్మ కోసం సోదరుడు శ్రీనివాసరావు, బాబాయి కుమారుడు వెంకటేశ్వరరావుతో కలిసి అలివేలు భర్త కృష్ణ (55) గురువారం బయలుదేరాడు. వారు సూరత్ చేరుకోకముందే అలివేలు మరణవార్త తెలిసి కృష్ణ, ఇద్దరు సోదరులు తిరుగుపయనమయ్యారు. నవజీవన్ రైలులో తిరిగి వస్తూ కృష్ణ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో రైలు మహబూబాబాద్ స్టేషన్‌లో ఆగగా, సోదరులకు తెలియకుండానే రైలు దిగాడు. ప్లాట్‌ఫాం వైపు కాకుండా మరో వైపు నుంచి దిగి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఎల్‌సీ గేట్ 80 సమీపంలో వెనుకనుంచి వస్తున్న దాణాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య మృతితో మనోవేదన కారణంగానే ఈ ఘటన జరిగిందని భావిస్తూ డోర్నకల్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేశారు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరి మృతదేహాలకు ఆదివారం ఒకేసారి గన్నవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. దంపతుల మృతితో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు.

భార్యను హతమార్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఖమ్మం జయనగర్ కాలనీలో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) పార్వతి(ఫైల్)

ఖమ్మంఅర్బన్: భార్యను తరచూ అనుమానిస్తూ.. చివరకు హతమార్చాడో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఈ ఘటన ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీలో విషాదం నింపింది. ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామానికి చెందిన భుక్యా సీతారాములుకు రఘునాథపాలేనికి చెందిన భుక్యా పార్వతి(43)తో 22 ఏళ్ల క్రితం వివాహమైంది. సీతారాములు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలు కాగా, హైదరాబాద్, విశాఖపట్నంలో చదువుకుంటున్నారు. కొంతకాలంగా పార్వతిపై అనుమానంతో సీతారాములు తరచూ వేధిస్తుండేవాడు. తట్టుకోలేని పార్వతి పోలీసులను ఆశ్రయించడంతో పాటు విడాకులు ఇప్పించాలని స్థానికులను కోరింది. దీంతో స్థానిక పెద్దలు సీతారాములును పిలిపించి మాట్లాడినప్పుడల్లా ఇకపై మంచిగా చూసుకుంటానని చెప్పి భార్యను తీసుకెళుతూ ఉండేవాడు. మూడు నెలల క్రితం కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరగగా, సీతారాములు భార్యను హతమార్చేందుకు యత్నించాడు. దీంతో పార్వతి తప్పించుకుని పుట్టింటికి వెళ్లింది. ఇటీవలే తోటి ఉద్యోగులను తీసుకెళ్లి మాయమాటలు చెప్పి పెద్ద మనుషుల సమక్షంలో పార్వతిని ఒప్పించి తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. కాగా, గత మూడు రోజులుగా భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో భార్యను హత్యచేసిన సీతారాములు ఇంటి నుంచి బైక్‌పై పరారయ్యాడు. వైజాగ్‌లో ఉండే కుమారుడికి ఫోన్ చేసి 'మీ అమ్మ నాతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింద'ని సమాచారం ఇచ్చాడు. దీంతో కుమారుడు తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో రఘునాథపాలెంలో ఉండే అమ్మమ్మకు ఫోన్ చేశాడు. ఆదివారం ఉదయం పార్వతి తమ్ముడు హరికృష్ణ ఇంటికి వచ్చి చూడగా పార్వతి విగతజీవిగా పడిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి హత్య జరిగిన తీరుపై ఆరా తీశారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైల్లో నుంచి జారిపడి బిహార్‌వాసి మృతి



లక్ష్మీంద్రకుమార్ మృతదేహం

ఖమ్మంక్రైం: రైల్లో నుంచి జారిపడి బిహార్ చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలో ఆదివారం చోటు చేసకుంది. రైల్వే ఎస్ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం పాట్నా పరిసర ప్రాంతానికి చెందిన లక్ష్మీంద్రకుమార్(26) పనినిమిత్తం బెంగళూరు వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. రైల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో డోర్ వద్ద కూర్చొని ప్రమాదవశాత్తు మల్లెమడుగు ప్రాంతంలో జారిపడి మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ద్వారా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించగా ఆయన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ కాల్వలో యువతి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని మార్చురీకి తరలిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ప్రశాంతినగర్ సమీపంలో సాగర్ ప్రధానకాల్వలో ఆదివారం ఓ గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యమైంది. కాల్వలోని నీటిలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడటంతో ఖమ్మంఅర్బన్ పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. యువతి మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహం వద్ద లభించిన పర్సులో రూ.6,600 నగదు ఉందని అన్నం శ్రీనివాసరావు తెలిపారు. యువతి వయస్సు 20 ఏళ్లలోపు ఉంటుందని పోలీసులు చెప్పారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారకుడైన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదైంది. ఎస్ఐ జి.రమణారెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని మద్దిరాలతండా గ్రామానికి చెందిన గంగావత్ రాములు (46) శనివారం సాయంత్రం టేకులపల్లికి వచ్చి సరుకులు తీసుకుని ద్విచక్రవాహనంపై రాత్రి స్వగ్రామానికి వెళ్తున్నాడు. దాసుతండా సమీపంలో టిప్పర్ ఆగి ఉండటం కారణంగా రాములు ఢీకొని మృతిచెందాడు. మృతదేహానికి ఇల్లెందు ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రోడ్డుపై నిర్లక్ష్యంగా టిప్పర్ నిలిపి ఉంచడం వల్లనే తన తండ్రి మృతిచెందాడని కుమారుడు శ్యామ్‌లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వీరబాబు మృతదేహం

పాల్వంచ: కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే వీసారపు వీరబాబు(54) ఆదివారం కళాశాల ఆవరణలోని మోటార్ స్విచ్ వేసేందుకు వెళ్లి అక్కడే అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. కొద్ది సేపటి తర్వాత గుర్తించిన సిబ్బంది అతడిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాగా, అతను ఫిట్స్ వచ్చి బురద నీటిలో పడి మృతిచెందాడని పలువురు చెబుతున్నారు. కానీ, మోటార్ స్విచ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అతని మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.